సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 7 । డిసెంబర్ । 2024



విధుల్లో నిర్లక్ష్యంపై కొరడా

విధుల్లో నిర్లక్ష్యంపై ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా కొరడా ఝుళిపించారు. ఒకరిపై సస్పెన్షన్ వేటు వేయగా.. మరొకరికి షోకాజ్ జారీ చేశారు.

8లో▸

నేడు 'ప్రజాపాలన' సంబరాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ప్రజాపాలన విజయోత్సవ సంబరాలను శనివారం నిర్వహించనున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం ప్రకటనలో తెలిపారు. ప్రజాహిత కార్యక్రమాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/21.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంబేడ్కర్ మహనీయుడు



నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహనీయుడని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి ఎస్పీ గౌస్ ఆలం, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, రాజ్యాంగ ప్రదాత అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రత్నజాడే ప్రజ్ఞాకుమార్, సమతా సైనిక్ దళ్ జిల్లా సంఘటకులు రమాకాంత్, పట్టణ సంఘటకులు జైపాల్, హర్షవర్ధన్, ఆమ్రపాలి, అరుణ, ధనశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

నేరడిగొండ:ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన రైతు ఆదుముల్ల సత్యనారాయణ వారం క్రితం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి రైతు బీమాతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో 194 ప్రకారం రూ.6లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట రైతులు రాములు, గంగన్న తదితరులున్నారు.

హాకీ కోర్టు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న పార్థసారథి

కైలాస్‌నగర్: జిల్లాలో ఆస్ట్రోటర్ఫ్ హాకీ కోర్టు ఏర్పాటు చేయాలని జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పార్థసారథి కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలకు హాజరైన ఇండియా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భోలేనాథ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎంతో మంది ప్రతిభగల హాకీ క్రీడాకారులు ఉన్నారన్నారు. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా హాకీ కేంద్రాన్ని కేటాయించిందన్నారు. ఆస్ట్రోటర్ఫ్ హాకీ కోర్టు సైతం ఏర్పాటు చేస్తే ఎంతోమంది నైపుణ్యం గల క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే హాకీ అకాడమీ సైతం ఏర్పాటు చేసేలా కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట రంగారెడ్డి జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్ష



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే సమ్మెకు దిగక తప్పదని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ అన్నారు. తమను రెగ్యులరైజ్ చేయడంతో పాటు పేస్కేల్ వర్తింప చేయాలనే డిమాండ్లతో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే రెగ్యులరైజ్ చేస్తామని బేసిక్ పే (మినిమం టైం స్కేల్) అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదన్నారు. సర్కారు తీరును నిరసిస్తూ రెండు రోజుల పాటు దీక్షలు చేపడుతున్నామన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. ఇందులో సంఘం నాయకులు ప్రకాశ్, పార్థసారథి, వెంకటి, దేవదర్శన్, వినోద్, సురేందర్, రాజన్న, నరేశ్, కేశవ్ ఆయా విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

పత్తికి మహర్దశ

జిల్లాకు పరిశోధన ఉపకేంద్రం

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ పత్తికి మహర్దశ పట్టనుంది. ఇప్పటికే ఇక్కడ పండించిన పత్తి నాణ్యమైనదిగా పేరుంది. రానున్న రోజుల్లో మరింత నాణ్యతతో కూడిన ఉత్పత్తే లక్ష్యంగా కేంద్రం దృష్టి సారించింది. ఈ మేరకు జిల్లాకు పత్తి పరిశోధన ఉప కేంద్రం మంజూరు చేసింది. దీంతో ఇక స్థానికంగానే జాతీయ స్థాయిలో పరిశోధనలు సాగనున్నాయి. ఇవి నూతన వంగడాల సాగు, చీడపీడల అదుపునకు దోహద పడనున్నాయి.



పత్తిలో గులాబీ రంగు పురుగుపై శాస్త్రవేత్తల పరిశోధన(ఫైల్)



- ఐకార్ నుంచి ఆమోదం
- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి..
- మరింత నాణ్యమైన ఉత్పత్తే లక్ష్యం
- నూతన వంగడాల సాగు.. చీడపీడల అదుపునకు పరిశోధనలు

భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కింద పని చేస్తుంది. దేశంలో సాగయ్యే అన్ని పంటలకు సంబంధించి ఐకార్ పరిశోధన చేస్తుంది. ఆయా రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్న పంటలకు అనుగుణంగా ఆ ప్రాంతాల్లో వివిధ పథకాలను అమలు చేస్తుంది. తాజాగా అఖిల భారత పత్తి పరిశోధన పథకం (ఏఐసీఆర్‌పీ) కింద రెండు కేంద్రాలను తెలంగాణ రాష్ట్రానికి మంజూరు చేసింది. అందులో ప్రధాన కేంద్రం వరంగల్‌లో, ఉప కేంద్రం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి.. అంటే వచ్చే పంటల సీజన్ నుంచి ఈ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేయనున్నాయి.

పరిశోధన కేంద్రం నుంచి..

అధిక దిగుబడినిచ్చే సాగు.. సమతుల్య ఎరువులు.. చీడపీడలు, తెగుళ్ల నివారణ చర్యలు.. పరిశోధన కేంద్రం నుంచి అభివృద్ధి చేసిన మెరుగైన రకాల పెంపకం.. అధిక నాణ్యత.. స్థిరమైన ఉత్పత్తి లక్ష్యంగా ఈ కేంద్రంలో పరిశోధనలు సాగనున్నాయి. ఆదిలాబాద్‌లో పత్తి పరిశోధన ఉప కేంద్రం ఏర్పాటుపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతుంది. నాణ్యమైన తెల్ల బంగారం సాగుకు అనుకూల ప్రాంతం, వివిధ అంశాలను బేరీజు వేసుకొని ఆదిలాబాద్‌ను పత్తికి కేరాఫ్‌గా గుర్తిస్తున్నారు.

పరిశోధనలతోనే సమస్యలకు చెక్..

మారుతున్న అవసరాలకు అనుగుణంగా పత్తి సాగులో గతంతో పోల్చితే అనేక మార్పులు వచ్చాయి. రైతులు నూతన వంగడాలు సాగు చేస్తున్నారు. 2002–03 నుంచి బీటీ సాగు మొదలైంది. ఈ క్రమంలో రైతులకు చీడపీడల వంటి సమస్యలు మొదలయ్యాయి. అయితే అంతర్జాతీయంగా తెలంగాణ పత్తికి, అందులో ఆదిలాబాద్ పత్తికి డిమాండ్ ఉన్నందున ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు పరిశోధన కేంద్రం ఏర్పాటు ఆవశ్యకమన్న అభిప్రాయం ముందునుంచి ఉంది. ఇదివరకు ఇక్కడ రాష్ట్రస్థాయిలోనే పత్తి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తారనే ప్రచారం సాగింది. అయితే ఇప్పుడు ఏకంగా కేంద్రం నుంచే ఇది మంజూరు కావడం గమనార్హం. తద్వారా విదేశీ ఎగుమతులకు అనువైన పత్తి రకాలు, విధానాలు, మార్కెటింగ్ సౌకర్యంపై లోతుగా దృష్టి సారించేందుకు దోహద పడుతుంది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో యాంత్రీకరణ ద్వారా పత్తి తీత అంశాలపై కూడా పరిశోధన చేసేందుకు వీలుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వ్యవసాయ పరిశోధన స్థానం నుంచే..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇప్పటికే వ్యవసాయ పరిశోధన స్థానం పనిచేస్తుంది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయానికి అనుబంధంగా కొనసాగుతుంది. ఇందులో ప్రధాన శాస్త్రవేత్త, ఇద్దరు శాస్త్రవేత్తలు ఉన్నారు. వీరు వివిధ పంటలపై పరిశోధనలు చేస్తుంటారు. తాజాగా ఇందులోనే కేంద్ర పథకం కింద పత్తి పరిశోధన ఉప కేంద్రం కూడా ఏర్పాటు కానుంది. ఈ సెంటర్‌లో ప్లాంట్ బ్రీడింగ్, ఎంటమాలోజీ, అగ్రనామి డిపార్ట్‌మెంట్లు ఏర్పాటయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. దాంట్లో భాగంగా ముగ్గురు శాస్త్రవేత్తలతో పాటు ఏఈవో, ఫీల్డ్ స్టాఫ్ పోస్టులు కూడా మంజూరయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. మ్యాన్‌పవర్, ఫైనాన్స్ పూర్తిగా కేంద్రమే భరించనుంది.



జిల్లా కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన స్థానం

ఫలితాలు ఎంతో ఉపయుక్తం..



జాతీయ స్థాయిలో జరిగే పత్తి పరిశోధన ఫలితాలు మనదగ్గర కూడా అవలంబించేందుకు దోహద పడుతుంది. అంతే కాకుండా ఇక్కడ ఏదైన పరిశోధన ఫలితం వచ్చిన పక్షంలో అది జాతీయ స్థాయిలో అమలుకు ఆస్కారం ఉంటుంది. ఉదాహరణకు.. గతంలో పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ కోసం లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలనేది ఇలాంటి పరిశోధనల ఫలితమే.

– డాక్టర్ శ్రీధర్ చౌహాన్, అసోసియేట్ డీన్, వ్యవసాయ కళాశాల, ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం, దిగుబడి వివరాలు (సుమారు)..

జిల్లా	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి (లక్షల క్వింటాళ్లలో)
ఆదిలాబాద్	4,11,578	32.92
కుమురంభీం	3,16,303	25.30
మంచిర్యాల	1,70,713	13.56
నిర్మల్	1,43,044	11.44

సంక్షేమంపై ఫోకస్



మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న అప్పటి కలెక్టర్ రాహుల్ రాజ్ (ఫైల్)

- రేవంత్ సర్కారుకు నేటితో ఏడాది పూర్తి
- ఆయా వర్గాలకు లబ్ధి చేకూర్చే దిశగా ప్రయత్నం
- రుణమాఫీతో అన్నదాతకు భరోసా
- ఆడపడుచులకు ఉచిత బస్సు ప్రయాణం

కైలాస్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టి నేటికి సరిగ్గా ఏడాది. ఆరు గ్యారెంటీల హామీలతో ప్రజల ఆశీర్వాదం పొందిన ప్రభుత్వం వాటినిఅమలు చేసే దిశగా సాగుతోంది. సంక్షేమ పథకాలపైఫోకస్ పెంచి రైతులు, మహిళలకు ప్రాధాన్యతనిస్తూనే మిగతా వర్గాలకు లబ్ధి చేకూర్చేలా కృషి చేస్తోంది. ఉద్యోగాల కల్పనలోనూ శ్రద్ధ వహిస్తూ యువతకు అండగా నిలుస్తోంది. ఏడాది కాలంలో జిల్లాలోని వివిధ వర్గాలకు కలిగిన ప్రయోజనాన్ని ఓసారి పరిశీలిస్తే..

రూ.697.1 కోట్ల రుణమాఫీ

రూ.2లక్షల్లోపు రైతుల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన విధంగా ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలుపుకుంది. జిల్లాలోని 62,972 మంది రైతులకు సంబంధించి రూ.697.1కోట్ల రుణాలు మాఫీచేసింది. తొలి విడతలో 18,852మందికి రూ.127.51 కోట్లు, రెండోవిడతలో 17,879మందికిరూ.203.44 కోట్లు, మూడోవిడతలో 19,634 మందికి రూ.287.17 కోట్లు, ఇటీవల అమలు చేసిన నాల్గో విడతలో 6,607 మంది రైతులకు రూ.78.98 కోట్లను మాఫీ చేసింది.

'మహాలక్ష్మి'తో ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకితెచ్చింది. జిల్లాలో ఇప్పటివరకు 1,26,66,189 మంది మహిళలు ఆర్టీసీ లో ఉచితంగా ప్రయాణించారు. తద్వారా సంస్థకు రూ. 8464.82 లక్షల ఆదాయం సమకూరింది. ఆదిలాబాద్ డిపో పరిధిలో 98,67,477 మంది, ఉట్నూర్ డిపో పరిధిలో 27,98,712 మంది ఉచితంగా ప్రయాణం చేశారు.

రూ.500లకే సిలిండర్

తెల్లరేషన్ కార్డు కలిగిన నిరుపేదలకు రూ.500 లకే ఎల్‌పీజీ సిలిండర్‌ను అందజేస్తోంది. ఈ పథకాన్ని ఈఏడాది ఫిబ్రవరి 29 నుంచి అమల్లోకి తెచ్చింది. జిల్లాలో ఇప్పటి వరకు 95,040 కుటుంబాలు ఈ పథకం కింద లబ్ధి పొందారు.

98వేల కుటుంబాలకు ఉచిత విద్యుత్

తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేలా గృహజ్యోతి పథకాన్ని ఈఏడాది ఏప్రిల్ నుంచి అమల్లోకి తెచ్చింది. జిల్లావ్యాప్తంగా 98వేల కుటుంబాలు ఈ పథకం కింద లబ్ధి పొందుతుండగా ప్రతి నెలా వాటికి రూ.3.75 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తోంది.

యువ వికాసం

సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో పాటు నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలను సైతం కల్పిస్తోంది. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో జిల్లాలో ప్రతిభ కనబరిచిన 276 మందికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పోలీస్ శిక్షణ పూర్తి చేసుకున్న 176 మంది యువత ఇటీవల జిల్లాలో విధుల్లో చేరారు. తాజాగా గ్రూప్–4లో ప్రతిభ చాటిన 176 మందికి పెద్దపల్లిలో జరిగిన బహిరంగసభలో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. వారం వ్యవధిలో వీరు కూడా విధుల్లో చేరనున్నారు. అలాగే వైద్య, ఆరోగ్యశాఖలోనూ పలు పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించింది.

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా మండలాలు

సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిస్తునే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాలో మూడుకొత్త మండలాలను ప్రకటించింది. జైనథ్ మండలంలోని భోరజ్, సాత్నాలతో పాటు బోథ్ మండల ప్రజలు ఎప్పటి నుంచో కోరుకుంటున్న సొనాల మండలాన్ని ప్రకటిస్తు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

పేదల ఆరోగ్యానికి భరోసా...

కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేస్తోంది. ఇదివరకు ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా సౌకర్యాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచింది. తెల్లరేషన్ కార్డుదారులందరికీ దీని ద్వారా లబ్ధి చేకూర్చుతుంది. అలాగే పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని ప్రకటించిన ప్రభుత్వం వాటికి సంబంధించిన సర్వేను ప్రారంభించడంతో అర్హులైన వారిలో హర్షం వ్యక్తమవుతుంది.

వీటి కోసం ఎదురుచూపులు..

ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రభుత్వం పలు హామీలను అమలు చేస్తున్నప్పటికీ మిగతా వాటిపై ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మహిళలకు మహాలక్ష్మి కింద నెలకు రూ. 2500 ఆర్థిక సాయం, చేయూత కింద వృద్ధులు, వితంతువులకు రూ.4వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్, అలాగే అన్నదాతకు రైతు భరోసా కింద ఏడాదికి రూ. 15వేలు, కౌలు రైతుకు రూ.12వేల ఆర్థికసాయం అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీలు ఇచ్చింది. ఇవి ఇంకా అమల్లోకి రాలేదు. వీటిని సైతం త్వరగా అమల్లోకి తీసుకురావాలని ఆయా వర్గాల ప్రజలు కోరుతున్నారు.

రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వానికి నివేదిక

- బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు



సమస్యలను వింటున్న డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలనే ఆయా సంఘాలు, కులస్తులు చేసిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో బీసీ సంఘాలు, బీసీ కులస్తుల నుంచి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపుపై శుక్రవారం అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని మేదరి, ఓడ్, ముదిరాజ్, రజక, మున్నూరుకాపు తదితర బీసీ సంఘాల ప్రతినిధులు, కులస్తులు హాజరై కమిషన్‌కు వినతిపత్రాలు అందజేశారు. తమ కులాల స్థితిగతులను వివరించారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కమిషన్‌కు మొత్తం 24 విజ్ఞప్తులు అందాయి. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రిజర్వేషన్ల పెంపుపై బీసీల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలుసుకునేందుకే ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే కుటుంబ సర్వేను సైతం చేపట్టిందన్నారు. ఆ సర్వే ముగిసి డేటా ఎంట్రీ ప్రక్రియ కూడా రెండు రోజుల్లో పూర్తి కానుందన్నారు. ఈ రెండు అంశాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందజేసి రిజర్వేషన్లు పెంచేలా తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఇందులో కమిషన్ సభ్యుడు సైదులు, కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, బీసీ సంక్షేమాధికారి రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

సమాజంలో అత్యధికంగా ఉన్న బీసీల వెనుకబాటును దూరం చేసేలా 42శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావును కలెక్టరేట్‌లో కలిసి బీసీ కులాల స్థితిగతులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లను గత ప్రభుత్వం తగ్గించి ఇబ్బందులకు గురిచేసిందన్నారు. గతంలో ఓ వర్గం వారిని బీసీ–ఈల్లో చేర్చడంతో విద్యాపరంగానే అది వర్తిస్తుందని అనుకున్నామని కానీ సుప్రీంకోర్టు విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి రంగాల్లోనూ వర్తిస్తాయని స్పష్టం చేసిందన్నారు. ఈనిర్ణయంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బీసీలకు రిజర్వేషన్ల కల్పనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అందుకే బీసీ కమిషన్, కులాల వారీగా గణన చేపట్టిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వెల్లడించారు. అనంతరం మాజీ మంత్రి జోగు రామన్న సైతం కమిషన్ చైర్మన్‌ను కలిశారు. జనాభాలో ఎవరికి ఇబ్బంది లేకుండా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

జైనథ్ ఆలయాన్ని సందర్శించిన చైర్మన్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జిల్లా పర్యటనకు విచ్చేసిన బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు జైనథ్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు.

యాపల్‌గూడ పాఠశాల ఆదర్శం



యాపల్‌గూడ పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందన

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచే సర్కారు బడుల్లో యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాల ఒకటని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వంటగదితో పాటు మధ్యాహ్న భోజనం వండే విధానం పరిశీలించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ఆంగ్ల పాఠాలు చదివించారు. వారి నుంచి సానుకూల స్పందన లభించడంతో ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు అవలంభిస్తున్న ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో విద్యా కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. యాపల్‌గూడ పాఠశాలలో విద్యార్థులకు ఆహ్లాదరకమైన వాతావరణంలో బోధనతో పాటు నాణ్యమైన భోజనం అందుతుందన్నారు. ఉపాధ్యాయులు టీం వర్క్ అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దృష్టికి వస్తున్న సమస్యలను సీఎం దృష్టికి త్వరలో తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయబృందం ఫొటోనుస్వయంగా తీసుకున్నారు. ఆయన వెంట డీఈవో ప్రణీత, డీఐఈవో రవీందర్ కుమార్, సెక్టోరియల్ అధికారి ఉదయ్‌శ్రీ, సుజాత్‌ఖాన్, హెచ్‌ఎం గంగన్న, తదితరులున్నారు.

గిరిజన విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యా కమిషన్ చైర్మన్ మురళి అన్నారు. గాదిగూడ మండలం అర్జుని గ్రామంలో గల బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. తరగతి గదులు, డైనింగ్‌హాల్, వంట గదులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లక్ష్యం

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ మురళి అన్నారు. కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతోకలిసి ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యా వ్యవస్థలో చేపట్టనున్న సంస్కరణలపై వారి అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ వసంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు భావితర శాస్త్రవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్‌లో ఇన్‌స్పైర్ మేళా, సైన్స్‌ఫేర్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నిత్యజీవితంలో సైన్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. వినూత్నంగా ఆలోచించి సృజనాత్మకత జోడించి సరికొత్త ఆవిష్కరణలు రూపొందించాలన్నారు. ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలన్నారు. పాఠశాల స్థాయిలోనే నూతన ఆవిష్కరణలు తయారు చేసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను కలెక్టర్, ఎమ్మెల్యేలు తిలకించారు. పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా అభినందించారు. ఇందులో జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, విద్యా శాఖ సెక్టోరియల్ అధికారి నారాయణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుదర్శన్, స్వామి, వృకోధర్, ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడు పవన్, ఆదినాథ్, రవీంద్ర, నూర్‌సింగ్, నవీన్‌యాదవ్, అశోక్, శ్రీహరిబాబు, పూర్ణచందర్, జలందర్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న రజిత

నేరడిగొండ: రాష్ట్ర స్థాయి అండర్–17 సాఫ్ట్ బాల్ పోటీలకు నేరడిగొండ కేజీబీవీ విద్యార్థినులు ఎంపికైట్లు ఎస్వో రజిత తెలిపారు. ఇటీవల బెల్లంపల్లి బాలికల జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి పోటీల్లో వారు ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. ఆర్.శ్రీలేఖ, డీ శిరీష, జే అనిత, టీ శిరీష, ఎం.శ్రీనిత్య, బీ వనిత ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 7, 8 తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని రజిత పేర్కొన్నారు. పీఈటీ స్నేహ, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పలువురు కార్మికులు రెండు, మూడేళ్లగా ఏడాదికి 100 మస్టర్లు కూడా చేయకుండా గైర్హాజర వుతుండగా వారికి శుక్రవారం సీఈఆర్ క్లబ్‌లో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. కాసిపేట–1, కాసిపేట–2 గనిలోని సుమారు 250 మంది గైర్హాజరు కార్మికులుండగా కౌన్సెలింగ్‌కు 150 మంది హాజరయ్యారు. కుటుంబ సభ్యుల సమక్షంలో అధికారులు వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇప్పటి నుంచి గైర్హాజరు కాకుండా విధులు నిర్వహించాలని సూచించారు. లేకుంటే భవిష్యత్‌లో ఉద్యోగం పోయే అవకాశముందని హెచ్చరించారు. ఎస్వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, పీఎం శ్యాం సుందర్, సీనియర్ పీఎం విశ్రాంత్, యూనియన్ల ప్రతినిధులున్నారు.

మంచిర్యాలలో డ్రంకెన్ డ్రైవ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో శుక్రవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురిని పట్టుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరచగా అడిషనల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నిరోషా ఎనిమిది మందికి వారంపాటు జైలు, 10 మందికి ట్రాఫిక్ విధులు నిర్వహించాలని శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు.

యువతి ఆత్మహత్యకు కారకుడైన యువకుడి అరెస్ట్

బెల్లంపల్లి: ప్రేమిస్తున్నానని నమ్మించి వంచించడంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకోగా అందుకు కారకుడైన యువకుడిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. బెల్లంపల్లి ఏసీపీ ఏ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లి హనుమాన్ బస్తికి చెందిన జంగపల్లి సాయి స్నేహిత (23) అనే యువతిని మహ్మద్ ఖాసీం బస్తికి చెందిన ఈదునూరి శ్రీనాథ్ ప్రేమ పేరుతో మోసం చేశాడు. ఆ బాధను తట్టుకోలేక సదరు యువతి గత సోమవారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు బాధ్యుడైన శ్రీనాథ్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు పంపించినట్లు ఏసీపీ వెల్లడించారు.

ఆవిష్కరణలు అదిరెన్!

- అబ్బురపరిచిన ప్రదర్శనలు
- ఆలోచింపజేసిన ప్రయోగాలు
- సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ మేళాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



విద్యార్థినుల ప్రదర్శన తిలకిస్తున్న న్యాయనిర్ణేతలు

ఆదిలాబాద్‌టౌన్: బాల మేధావులు భళా అనిపించారు. విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలు తయారు చేశారు. భావి శాస్త్రవేత్తలుగా కొత్త ఆలోచనలతో అందరినీ ఆలోచింపజేశారు. నిత్యజీవితంలో మానవాళికి ఉపయోగపడే అంశాలతో ప్రదర్శనలు చేపట్టారు. వీటిని తిలకించిన వారు బాల మేధావులను అభినందించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ హైస్కూల్‌లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి దాదాపు 300 ప్రదర్శనలు విద్యార్థులు తయారుచేసి తీసుకువచ్చారు. ప్రదర్శనను కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు తిలకించి అభినందించారు. కొంతమంది విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనల ప్రత్యేకతలు వారి మాటల్లోనే..

నీటిలో పంటలు సాగు



నీటిలో కూడా పంటలు సాగు చేసుకోవచ్చు. ఇంటి డాబాపై, ఇంటిలోపల కూడా ఆకుకూరలు, కూరగాయలు పండించవచ్చు. మట్టి అవసరం లేకుండా ఆధునిక పద్ధతిలో తక్కువ స్థలంలోనే హైడ్రోపోనిక్ విధానం ద్వారా మనకు అవసరమైన పంటలు సాగు చేసుకోవచ్చు. ఈ పద్ధతిని చాలా దేశాల్లో వినియోగిస్తున్నారు. అందుకే మా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.
– అనుష్క, సాయిప్రియ, పొన్నారి

బ్యాగు భారమైతే ఇలా..



చాలా పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్కులు మోయలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థి బరువు కంటే బ్యాగ్ బరువే ఎక్కువగా ఉంటోంది. దీంతో వెన్నెముక దెబ్బతింటోంది. విద్యార్థుల ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రభుత్వం ఇదివరకే పుస్తకాల భారం తగ్గించాలని చెప్పినా ఎక్కడా అమలు కావడం లేదు. ఐదో తరగతి విద్యార్థి 2 కిలోలకు బదులు 5కిలోల వరకు బరువు మోస్తున్నాడు. 6, 7తరగతుల వారు 4కిలోలకు బదులు 7కిలోలు, 8, 9 తరగతుల వారు 5కిలోలకు బదులు 8కిలోల వరకు బరువు మోస్తున్నారు. అందుకే ఈ ప్రదర్శన ద్వారా అధిక భారం మోస్తే కలిగే అనర్థాల గురించి వివరిస్తున్నా.
– శివశంకర్, బంగారుగూడ మోడల్ స్కూల్

కూలీల కొరత అధిగమించేందుకు..



వ్యవసాయ పనుల్లో ప్రస్తుతం కూలీల కొరత వేధిస్తోంది. దీన్ని అధిగమించేందుకు వ్యవసాయ పరికరాన్ని తయారు చేశాం. ఈ పరికరంతో ఓవైపు దుక్కిదున్నడంతో పాటు అదే సమయంలో విత్తనాలు, మందులు, ఎరువులు వేయొచ్చు. దీంతో సమయం ఆదా అవుతుంది. మరోవైపు రైతులకు పెట్టుబడి భారం కూడా తగ్గుతుంది. రాత్రి వేళ కూడా ఈ యంత్రం ద్వారా పనులు చేసుకునే అవకాశముంది. ఇందుకోసం డీసీ మోటర్, వాటర్ మిషన్, ఇతర పరికరాలను ఉపయోగించాం. తక్కువ ఖర్చుతోనే దీన్ని తయారు చేసుకోవచ్చు. రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.
– ఆర్య, ఆదిత్య, బరంపూర్

సేంద్రియ సాగు బాగు



సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తే పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుంది. ఆవులు, గేదెల పేడ ద్వారా తయారు చేసిన ఎరువులను వాడితే భూసారం దెబ్బతినకుండా ఉంటుంది. మానవాళి ఆరోగ్యానికి ఎలాంటి ముప్పు ఉండదు. రసాయన ఎరువులు వినియోగించడంతో పర్యావరణ దెబ్బతింటుంది. అందుకే సేంద్రియ ఎరువుల ప్రయోజనాన్ని మా ప్రదర్శన ద్వారా వివరిస్తున్నాం.
– రితిక, ప్రణయరెడ్డి, వెంకటేశ్వర విద్యామందిర్, ఆదిలాబాద్

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు



నివాళులర్పిస్తున్న వీసీ గోవర్ధన్

భైంసా: భావితరాలకు అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపస్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వివక్ష, అసమానతలు లేని స మాజం కోసం అంబేడ్కర్ కృషిచేశారని కొనియాడా రు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీఎఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీదర్శన్, ట్రిపుల్‌ఐటీ ఏవో రణధీర్‌సాగి, అజయ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తోడేలు దాడిలో 11 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

జన్నారం: గొర్రెల మందపై తోడేలు దాడి చే యగా 11 గొర్రెలు చనిపోయిన ఘటన మండలంలోని మురిమడుగు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు సందెవేని రాజన్న తెలిపిన వివరాల ప్రకారం .. గురువారం రాత్రి రాజన్న తన గొర్రెల మందను ఇంటి పక్కనున్న దొడ్డిలో తోలి రోజులాగే పడుకున్నారు. అర్ధరాత్రి దాటాక గొర్రెల అరుపులు వినిపించాయి. అనుమానంతో లేచి మంద వద్దకు వెళ్లి కేకలు వేయగా తోడేలు పారిపోయింది. పరిశీలించగా అప్పటికే 11 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల విలువ రూ.1.60 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. విషయం తెలుసుకున్న ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కా రం శ్రీనివాస్ ఆదేశాల మేరకు సెక్షన్ అధికారి రవి వెళ్లి పరిశీలించారు. పంచనామా నిర్వహించారు. గొర్రెలను హతమార్చిన విధానం చూస్తే అది తోడేలు కాదని, అడవి కుక్కలని అటవీ అధికారులు భావించారు. ఉన్నతాధికా రులకు రిపోర్టు చేసి బాధితునికి పరిహారం అందేలా చూస్తామని రేంజ్ అధికారి తెలిపారు.

నిలిచిన భూసార పరీక్షలు

చెన్నూర్‌రూరల్: నాలుగేళ్లుగా భూసార పరీక్షలు లేక రైతులు ఇష్టానుసారంగా పంటలు సాగు చేసి నష్టపోతున్నారు. మంచిర్యాల జిల్లాలో 55 రైతు వేదికలుండగా వీటిలోనే భూసార పరీక్షలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. 2018లో ప్రతీ మండలంలోని క్లస్టర్ పరిధిలో భూసార పరీక్షలు నిర్వహించేందుకు రూ.1.30లక్షలతో కిట్లు, పరికరాలు, రసాయనాలు అందించారు. ప్రస్తుతం మట్టి పరీక్షలు చేసేందుకు అవి అందుబాటులో లేక పరికరాలు నిరుపయోగమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం 2016లో నేషనల్ మిషన్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ (ఎన్ఎంఎస్ఏ) పథకం కింద మట్టి నమూనాలు సేకరించింది. పరీక్షలు నిర్వహించి రైతులకు భూసార ఆరోగ్య కార్డులు అందించింది. మూడేళ్లు కొనసాగిన ఈ పథకం తర్వాత నిలిచింది. దీంతో భూసార పరీక్షలు లేక రైతులు పంటల సాగులో ఇబ్బందులు పడుతున్నారు. తద్వారా నష్టపోతున్నారు.



నివేదికలు పంపించాం



క్లస్టర్ పరిధిలోని మినీ భూసార పరీక్షా కేంద్రాల్లో రసాయనాలు, ద్రావణాలు ఉన్నంత వరకు పరీక్షలు నిర్వహించాం. వాటి సరఫరా నిలిచిపోగా ప్రభుత్వానికి నివేదించాం. నిధులు కేటాయిస్తే మళ్లీ భూసార పరీక్షలు నిర్వహిస్తాం.
– ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్

పులిజాడ కోసం ప్రత్యేక బృందాలు

- ఇటిక్యాల పహాడ్‌లో పర్యటించిన వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఏలు సింగ్
- ఇరురాష్ట్రాల అధికారులతో ప్రత్యేక సమావేశం
- పెద్దపులుల సంచారం, రాకపోకలపై చర్చ



పులి పాదముద్రలు పరిశీలిస్తున్న వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ ఏలు సింగ్, తదితరులు

సిర్పూర్(టి): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వారం రోజులుగా సంచరిస్తున్న కొత్త పులి జాడ కోసం అటవీశాఖ ప్రత్యేక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. సిర్పూర్(టి) మండలం ఇటిక్యాల పహాడ్ గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో శుక్రవారం ఉదయం పాదముద్రలు కనిపించడంతో వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ ఏలు సింగ్, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ ఆధ్వర్యంలో జాడను గుర్తించేందుకు ప్రయత్నించారు. ఇటిక్యాల పహాడ్ గ్రామం తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు అటవీప్రాంతానికి ఆనుకుని ఉండటంతో మహారాష్ట్ర నుంచి పెద్దపులుల రాకపోకల గురించి ఆరా తీశారు. తాడోబా, కవ్వాల్ టైగర్ కారిడార్‌లో వీరూర్ అటవీప్రాంతం నుంచి సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని మాకిడి, ఇటిక్యాల పహాడ్ మీదుగా కవ్వాల్ అభయారణ్యం, కాగజ్‌నగర్ డివిజన్‌లోకి పులులు ప్రవేశిస్తాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని ఇటిక్యాల పహాడ్, మాకోడి సరిహద్దులో తెలంగాణ వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ ఏలు సింగ్ ఆధ్వర్యంలో తెలంగాణ అటవీశాఖ అధికారులు, మహారాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో పెద్దపులుల సంచారం, సంరక్షణతోపాటు ఇరురాష్ట్రాల భవిష్యత్ కార్యాచరణ, అధికారుల విధులు, సమీపంలోని గ్రామాల ప్రజల రక్షణపై చర్చించినట్లు అధికారులు వెల్లడించారు.

ద్విచక్రవాహనాల చోరీ ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమేశ్

గుడిహత్నూర్: వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విలేకరుల సమావేశంలో ఇచ్చోడ సీఐ భీమేశ్ వివరాలు వెల్లడించారు. ఆరుగురు ముఠాగా ఏర్పడి మండల కేంద్రంలోని లాందాడె రాంకిషన్‌కు చెందిన బైక్‌ను బుధవారం అర్ధరాత్రి దొంగిలించి కొంత దూరంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. గమనించిన స్థానికులు బైక్‌ను గుర్తించి రాంకిషన్‌కు తెలిపారు. అక్కడికి చేరుకున్న రాంకిషన్‌కు బైక్ కనిపించకపోగా పక్కనే ఒక ఆటోలో నలుగురు యువకులున్నారు. వారిని అడిగే ప్రయత్నం చేయగా దాడికి యత్నించారు. దీంతో రాంకిషన్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సహకారంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, అదేరోజు రాత్రి మరో రెండు చోట్ల బైక్ చోరీలకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. ఈ ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వారిగా గుర్తించారు. వీరంతా 25 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. చెడు వ్యసనాలకు బానిసై జిల్లా వ్యాప్తంగా వరుస చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. బుధవారం రాత్రి బైక్ చోరీ విషయం తెలుసుకున్న ఎస్సై మహేందర్ వారిని పట్టుకోవడానికి చాకచక్యంగా వ్యవహరించి సఫలీకృతులయ్యారు. దీంతో ఎస్సై మహేందర్, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించినట్లు ఇచ్చోడ సీఐ భీమేశ్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యంపై కొరడా

- స్కూళ్లు తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో
- 'గంగాపూర్' ఉపాధ్యాయుడి సస్పెన్షన్
- మధ్యాహ్న భోజన ఏజెన్సీ రద్దు

నార్నూర్: విధుల నిర్లక్ష్యంపై ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా కొరడా ఝళిపించారు. ఒకరిపై సస్పెన్షన్ వేటు వేయగా.. మరొకరికి షోకాజ్ జారీ చేశారు. మండలంలోని గంగాపూర్, నాగల్‌కొండ, దేవారి గూడలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు జామ్డా మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో సౌకర్యాల కల్పనతో పాటు బోధన తీరుపై ఆరా తీశారు. గంగాపూర్ టీడబ్ల్యూపీఎస్ తనిఖీ సమయంలో ఉపాధ్యాయుడు యశ్వంత్‌రావు గైర్హాజరయ్యారు. కాగా, ఆయన స్థానంలో ప్రైవేట్ వ్యక్తిని నియమించి బోధన చేయడంపై పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. నాణ్యతగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తంజేశారు. సంబంధిత ఏజెన్సీని రద్దు చేశారు. అలాగే దేవారిగూడ పాఠశాల తెరుచుకోకపోవడంపై ఎస్ఈఆర్‌పీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడికి షోకాజ్ జారీ జేశారు. అంగన్‌వాడీ టీచర్ సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో పాటు భోజన తయారీలో నాణ్యత పాటించకపోవడంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ డీడబ్ల్యూవోను ఆదేశించారు. అనంతరం జామ్డా స్పోర్ట్స్ మోడల్ పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పీవో వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులున్నారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు



బాధితునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

గుడిహత్నూర్: మండలంలోని మాన్కాపూర్ గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి చెట్టు ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కాలు ఆటోలో ఇరుక్కుంది. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రమాదాన్ని గమనించా రు. తన కారును రోడ్డు పక్కన నిలి పి ఆటోలో ఇరుక్కుపోయిన వ్యక్తిని బయటకు తీయించారు. 108లో క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు.

ఆటో బోల్తా పడి ఎనిమిది మందికి గాయాలు

భైంసా టౌన్: కుభీర్ మండలం పల్సి తండా వద్ద ఆటో బోల్తా పడగా ఎనిమిది మంది గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని తోటంబ నుంచి నెక్లి వైపు ఆటోలో వెళ్తుండగా, శుక్రవారం రాత్రి పలుచి తండా వద్ద ప్రమాదవశాత్తు అది బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా సిబ్బంది క్షతగాత్రులను భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో శేషాబాయి, కవిత, రంజన, అశ్వితకు తీవ్ర గాయాలయ్యాయి.

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి వద్ద శుక్రవారం బైక్ పైనుంచి కింద పడి కుసుమ్‌దేవి (32) మృతి చెందింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవాపూర్‌కు చెందిన సురేంద్రసింగ్ తన భార్య దేవి, కూతురు అనన్యతో దేవాపూర్ నుంచి బైక్‌పై మంచిర్యాలకు వెళ్తున్నాడు. మార్గంమధ్యలో ముత్యంపల్లి మహరాజుల కాలనీ వద్ద స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ కుదుపునకు కుసుమ్‌దేవి కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను కాసిపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వదిన సరిత ఫిర్యాదు మేరకు బైక్ అజాగ్రత్తగా నడపడంతోనే దేవి కింద పడినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో హార్వెస్టర్ డ్రైవర్‌కు గాయాలు



గాయపడ్డ కొండయ్య అలియాస్ సంతోష్

నెన్నెల: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల స మీపంలో శుక్రవారం హార్వెస్టర్‌తో వరి కోస్తుండగా 11కేవీ విద్యుత్ తీగలకు తగి లి చిన్నతండాకు చెందిన డ్రైవర్ దరావత్ కొండయ్య అలియాస్ సంతోష్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండయ్య నె న్నెలకు చెందిన దూపం కుమార్ పొలంలో తన సొంత హార్వెస్టర్‌తో వరి కోస్తూ డబ్బాలో ధాన్యం నిండిందా? లేదా.. అని దాని పైకి ఎక్కాడు. పైన ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు గమనించకపోవడంతో అవి భుజానికి తగిలి షాక్‌కు గురై కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో కొండయ్య రెండు భుజాలు, చేతులతో పాటు ముఖం పూర్తిగా కాలిపోయింది. వెంటనే విద్యుత్ సిబ్బంది సరఫరా నిలిపివేయగా పెద్ద ప్ర మాదం తప్పింది. గాయపడిన అతడిని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కొండయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హత్య కేసులో యువకుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ అఫ్జలొద్దీన్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని పాత బెల్లంపల్లి గ్రామంలో గురువారం జరిగిన మహిళ హత్య కేసులో యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయంలో సీఐ అఫ్జలొద్దీన్ వివరాలు వెల్లడించారు. పాత బెల్లంపల్లికి చెందిన కమ్మరి మహేశ్ తన భార్య మౌనిక, అత్త పద్మతో గొడవ పడుతున్న క్రమంలో సమీప బంధువు (నాన్నమ్మ) యెండల కమల (50) అక్కడికి వచ్చింది. మహేశ్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. దీంతో మహేశ్ కమలపై దాడి చేయగా ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయింది. కొద్ది సేపటి తర్వాత మంచి నీటి కోసం మహేశ్ ఇంటి సమీపంలోని చేతిపంపు వద్దకు వెళ్లగా కాపు కాచుకుని ఉన్న మహేశ్ అక్కడ ఉన్న గూన పెంకతో కమలపై దాడి చేశాడు. నీటితో ఉన్న బిందెను ఆమె ఎత్తేశాడు. ఛాతి, కడుపు భాగంలో బలంగా తన్నాడు. దీంతో కమల అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబీకులు ఆమెకు బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించే క్రమంలో మృతి చెందింది. కమల కుమారుడు రమేశ్ తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. కమలను హత్య చేసిన మహేశ్ బిందెను సమీప పొదల్లో పారేసి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో తలదాచుకున్నాడు. శుక్రవారం వేరే ప్రాంతానికి వెళ్లే క్రమంలో అతడిని అరెస్ట్ చేసి బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పర్చి అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో తాళ్లగురిజాల ఎస్సై రమేశ్, హెడ్ కానిస్టేబుల్ రాజం ఉన్నారు.

మద్యం మత్తులో వృద్ధుడి ఆత్మహత్య

నెన్నెల: మండలంలోని దమ్మిరెడ్డిపేటకు చెందిన పసుల పోశం (74) అనే వృద్ధుడు గురువారం మద్యం మత్తులో పురుగుల మందు తాగి అదేరోజు రాత్రి మంచిర్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పోశం రోజూ మద్యం తాగి చనిపోతానంటూ పిచ్చిపిచ్చిగా ప్రవర్తించేవాడు. గురువారం ఉదయం ఇంట్లోని వారంతా పత్తి ఏరేందుకు చేనుకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న పోశం ముందుగా మద్యం, ఆ తర్వాత పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన చుట్టు పక్కల వారు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతడి ఇద్దరు కొడుకులు దేవేందర్, శేఖర్ పోశంను బైక్‌పై నెన్నెల వరకు అక్కడి నుంచి ఆటోలో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 2గంటలకు మృతి చెందాడు. అతడి భార్య బానక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.